సాక్షి ఖమ్మం

మంగళవారం । 17 । జూన్ । 2025



### అర్చక, ఉద్యోగులకు శుభవార్త

ఆలయాల అర్చక, ఉద్యోగులకు ఆర్థిక, సామాజిక భద్రత లభించేలా ప్రభుత్వం సంక్షేమ నిధి విధివిధానాలను ఖరారు చేసింది. 8లో



### స్త్రీ నిధి లక్ష్యం.. రూ.82.99కోట్లు

జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులకు ఈ ఏడాది స్త్రీ నిధి ద్వారా మంజూరు చేయాల్సిన రుణాలపై లక్ష్యాన్ని నిర్దేశించారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
33° / 27°

### వాతావరణం

జిల్లాలో మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలే ఉంటాయి. కొన్నిచోట్ల ఆకాశం మేఘావృతమై వర్షం కురిసే సూచనలు ఉన్నాయి.

## న్యూస్‌రీల్

### రేపు డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

**ఖమ్మంమయూరిసెంటర్/మధిర:** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం ఖమ్మం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఉద్యోగుల కోసం నిర్వహించే హెల్త్ క్యాంప్‌ను, ఆతర్వాత విద్యుత్ అంబులెన్స్‌ను ప్రారంభిస్తారు. అనంతరం మధ్యాహ్నం 12గంటలకు బోనకల్ మండలం జానకీపురం సబ్ స్టేషన్‌లో అభివృద్ధి పనులను ప్రారంభించాక మధిర బయలుదేరతారు. అక్కడ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి రూ.10 కోట్లతో పాత బస్టాండ్ స్థానంలో నిర్మించే నూతన ఆర్టీసీ బస్టాండ్‌కు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేయనున్నారు.

### అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

**ఖమ్మం సహకారనగర్:** ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రథమ సంవత్సరం జనరల్ విభాగంలో 9,600మంది పరీక్ష రాయగా 7,248మంది (75.50శాతం) ఉత్తీర్ణత సాధించారని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు తెలిపారు. అలాగే, ఒకేషనల్ విభాగంలో 676మందికి 444మంది(65.68 శాతం) ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగంలో 3,745మందికి 2,293మంది(61.23శాతం), ఒకేషనల్ విభాగంలో 622మందికి 337మంది (54.18శాతం) ఉత్తీర్ణత సాధించారని తెలి పారు. కాగా, ప్రథమ సంవత్సరం ఫలితాల్లో జిల్లా రాష్ట్రస్థాయిలో మూడో స్థానం, ద్వితీయ సంవత్సరంలో 11వ స్థానం దక్కించుకుందని డీఐఈఓ వెల్లడించారు.

**దరఖాస్తు చేసుకోండి**

ఇంటర్మీడియట్ ఫలితాలపై సందేహాలు ఉంటే రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు ఈనెల 23వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని డీఐఈఓ కె.రవిబాబు తెలిపారు. tsbie.cgg.gov.in వెబ్‌సైట్‌లోని స్టూడెంట్ సర్వీసెస్ విభాగం ద్వారా దరఖాస్తులు సమర్పించవచ్చని పేర్కొన్నారు. రీ వెరిఫికేషన్ ఒక్కో సబ్జెక్టుకు రూ.600, రీకౌంటింగ్‌కైతే రూ.వెయ్యి ఫీజు చెల్లించాలని డీఐఈఓ తెలిపారు.

### 2.88లక్షల మంది రైతుల ఖాతాల్లో 'పెట్టుబడి'

**ఖమ్మంవ్యవసాయం:** వానాకాలం పంటల పెట్టుబడి సాయం(రైతు భరోసా) పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. హైదరాబాద్‌లోని ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సోమవారం జరిగిన 'రైతు నేస్తం' కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అక్కడే ఈ పథకం ద్వారా నగదు జమ చేయడాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా పాల్గొనగా.. జిల్లాలోని రైతు వేదికల నుంచి అధికారులు, రైతులు హాజరయ్యారు. 'రైతు భరోసా' ద్వారా జిల్లాలో 3,53,794 మంది రైతులను అర్హులను గుర్తించగా, ఎకరాకు రూ.6వేల చొప్పున రూ.436.84 కోట్ల సాయం వారి ఖాతాల్లో జమ కానుంది. ఈమేరకు తొలిరోజైన సోమవారం రెండు ఎకరాల లోపు భూమి కలిగిన రైతులకు పెట్టుబడి సాయం జమ చేశారు. జిల్లాలో 2,88,387మంది రైతుల ఖాతాల్లో రూ.250,84,22,381 నగదు జమ కాగా, వారి ఫోన్లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరిట ప్రభుత్వం నుంచి మెసేజ్ అందింది. జిల్లా రైతుల ఖాతాల్లో దశల వారీగా ఈనెల 24వ తేదీ వరకు నగదు జమ అయ్యే అవకాశముంది.

### పరిశుభ్రతతోనే డయేరియా నిర్మూలన



అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌ఓ కళావతిబాయి

**రఘునాథపాలెం:** ఇళ్లలోనే కాక పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని, తద్వారా డయేరియా సహా ఎలాంటి వ్యాధులు దరిచేరవని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కళావతిబాయి తెలిపారు. డయేరియా నిర్మూలన ప్రచారంలో భాగంగా సోమవారం రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. డయేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల వినియోగంపై బాలింతలు, గర్భిణులతో పాటు స్థానికులకు అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి చందునాయక్, వైద్యులు బాలకృష్ణ, మౌనిక మాట్లాడగా ఉద్యోగులు పుష్పవతి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎందుకీ అసంతృప్తి?



ఖమ్మంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల

### ఖమ్మం మెడికల్ కాలేజీలో ఎన్‌ఎంసీ బృందం తనిఖీ

- సౌకర్యాలు, వసతులపై పెదవి విరుపు
- తుది తనిఖీకి వచ్చేలోగా సరిచేయాలని సూచనలు
- కాలేజీలో మూడో ఏడాది అనుమతులపై సందిగ్ధత

**ఖమ్మంవైద్యవిభాగం:** ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్వహణపై జాతీయ వైద్య కమిషన్(ఎన్‌ఎంసీ) బృందం అసంతృప్తి వ్యక్తం చేసింది. 2025–26 ఏడాదికి ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపు కోసం రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో ఇటీవల తనిఖీ చేయగా.. 26 ప్రభుత్వ కళాశాలల్లో లోపాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ జాబితాలో ఖమ్మం కాలేజీ ఉండడం చర్చనీయాంశంగా మారింది. ప్రతీ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి ముందు నేషనల్ మెడికల్ బృందం తనిఖీ చేయడం ఆనవాయితీ. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మౌలిక వసతులు, అధ్యాపకులు, ఆధార్‌తో బయోమెట్రిక్ హాజరు నమోదు, అనుబంధ ఆస్పత్రిలో చికిత్స, వైద్య పరికరాలను పరిశీలించి సంతృప్తి చెందితే అనుమతులు జారీ చేస్తారు. ఇందులో భాగంగా వచ్చే విద్యాసంవత్సరానికి గాను ఎన్‌ఎంసీ బృందం ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో తనిఖీ చేపట్టగా, ఇక్కడి సదుపాయాలపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం.

**రాష్ట్ర స్థాయిలో గుర్తింపు ఉన్నా...**

ఖమ్మంలో ఏర్పాటైన ప్రభుత్వ మెడికల్ కళాశాల రాష్ట్ర స్థాయిలో గుర్తింపు సాధించింది. రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత ఏ జిల్లాలో కూడా ప్రభుత్వ మెడికల్ కాలేజీకి విశాలమైన భవనాలు, సమీపాన జిల్లా జనరల్ ఆస్పత్రి ఎక్కడా లేవు. ఖమ్మం నడిబొడ్డున సుమారు 30 ఎకరాల్లో కళాశాల ఏర్పాటుచేయడం విశేషంగా చెబుతారు. అలాగే, అనుబంధంగా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి సైతం రాష్ట్ర స్థాయిలో గుర్తింపు ఉంది. సుమారు 500 పడకలు ఉండగా, నిత్యం 1,500 మంది నుండి 2వేల మంది చికిత్స కోసం వస్తుంటారు. అలాగే, ఆస్పత్రి ఆవరణలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలు అత్యధికంగా జరుగుతున్నాయి. కళాశాలకు అనుసంధానంగా ఇంత పెద్ద ఆస్పత్రి ఉండడంతో విద్యార్థులకు బోధన సాఫీగా సాగుతుండగా.. మెడికల్ కాలేజీలోనూ అధ్యాపకులు సరిపడా ఉన్నారు. అలాగే, ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ హాజరు నమోదు, సీసీ కెమెరాలు, చికిత్సపై అవగాహన పెంచుకునేలా ఆస్పత్రిలో రోగులు, అవసరానికి మించి మృతదేహాలు ఉన్నాయి. అంతేకాక తొలి ఏడాది ఎంబీబీఎస్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించగా, గత ఏడాది ఈ కళాశాలలో చేరేందుకు మెరిట్ ర్యాంకర్లు ఆసక్తి కనబరిచారు. అయినప్పటికీ ఎన్‌ఎంసీ బృందం ఎందుకు అసంతృప్తి వ్యక్తం చేసిందో తెలియడం లేదని అధ్యాపకులు చెబుతున్నారు. అయితే, తుదిదశలో మరోమారు తనిఖీ చేయనున్నందున బృందం చేసిన సూచనల మేరకు సరిచేస్తే అనుమతులు జారీ చేసే అవకాశముందని తెలుస్తోంది.

**2022లో ప్రారంభం**

ఖమ్మంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల 2022 మార్చిలో ఏర్పాటైంది. నూతన భవనాల నిర్మాణం కోసం రూ. 166 కోట్లతో పాటు 30 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణతో కలిపి 21.31 ఎకరాలు, పాత కలెక్టరేట్ ఆవరణ 5.23 ఎకరాలు, ఆర్‌అండ్‌బీ కార్యాలయం 3.09 ఎకరాలను అప్పట్లో కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రభుత్వ ఆస్పత్రికి అనుసంధానంగా పాత కలెక్టరేట్‌లో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసేలా భవనాల ఆధునికీకరణ, మరమ్మతులకు తొలుత ప్రభుత్వం రూ.8.05 కోట్లు మంజూరు చేసింది. దీంతో చకచకా పనులు చేపట్టిన కళాశాలను అందుబాటులోకి తీసుకురాగా 100 ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి ఎన్‌ఎంసీ అనుమతులు జారీ చేసింది. దీంతో 2023 ఆగస్టులో తొలిఏడాది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించి సెప్టెంబర్‌లో తరగతులు ప్రారంభించారు. అలాగే గత ఏడాది కూడా భర్తీ చేయగా ప్రస్తుతం మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులు కలిపి 200 మంది చదువుతున్నారు. ఇప్పుడు మూడో ఏడాదికి అనుమతి జారీ చేయాల్సి ఉండగా, ఎన్‌ఎంసీ బృందం తనిఖీలు చేపట్టింది.

**అనుమతి తప్పక వస్తుంది..**



మూడో ఏడాది ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి ఎన్‌ఎంసీ నుంచి తప్పక అనుమతి వస్తుందనే నమ్మకముంది. రాష్ట్ర స్థాయిలోనే ఖమ్మం కళాశాలకు మంచి గుర్తింపు ఉంది. నిబంధనల మేరకు విశాలమైన భవనం, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంతో పాటు బాలుర, బాలికలకు హాస్టళ్లు, ఇతర వసతులు కల్పించాం. అయితే, అప్‌డేట్ అయిన వాటిని ఎన్‌ఎంసీ బృందం పరిశీలించనందున హైదరాబాద్ వెళ్లి డీఎంఈకి వివరించా. అందుకే అనుమతులపై ఆందోళన చెందాల్సిన పనిలేదు.

– సుంకర రాజేశ్వరరావు, కాలేజ్ ప్రిన్సిపాల్

# మూడున్నర ఏళ్లలో 20 లక్షల ఇళ్లు



మోటాపురంలో రోడ్డుకు శంకుస్థాపన చేసిన మంత్రి శ్రీనివాసరెడ్డి, పక్కన కలెక్టర్ అనుదీప్

- దశల వారీగా అర్హులందరికీ మంజూరు
- రాష్ట్ర మంత్రి శ్రీనివాసరెడ్డి

**నేలకొండపల్లి:** వచ్చే మూడున్నర ఏళ్లలో రాష్ట్రంలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలనేది తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. మండలంలోని గువ్వలగూడెం, కోరట్లగూడెం, మోటాపురంలో సోమవారం పర్యటించిన ఆయన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ తమ ప్రభుత్వం పేదల అభ్యున్నతే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలుచేస్తోందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతీ నియోజకవర్గానికి ప్రస్తుతం 3,500 ఇళ్లు మంజూరు చేయగా దశల వారీగా అర్హులందరికీ కేటాయిస్తామని చెప్పారు. ఇప్పటికే ఉచిత విద్యుత్, గ్యాస్, బస్సు ప్రయాణం అమలవుతుండగా, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10లక్షలకు పెంచామన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో రూ.17 వేల కోట్ల రుణమాఫీ చేస్తే... తమ ప్రభుత్వం పది నెలల్లోనే రూ.21 వేల కోట్లు మాఫీ చేసిందని వెల్లడించారు. అంతేకాక సన్న ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లిస్తూ రైతులకు అండగా నిలిచామని మంత్రి తెలిపారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఆర్డీఓ నర్సింహారావు, మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములుతో పాటు నాయకులు శాఖమూరి రమేష్, భద్రయ్య, కొడాలి గోవిందరావు, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, రావెళ్ల కృష్ణారావు, కడియాల నరేష్, కొమ్మినేని విజయ్‌బాబు, కె.హన్మంతరావు, మార్తి కోటి, మధు, వెంకటేశ్వర్లు, వాసు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం రైతులు హుషారు!

**ఆదర్శ రైతు రామకృష్ణతో సీఎం రేవంత్‌రెడ్డి**



సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడుతున్న రైతు రామకృష్ణ, పక్కన కలెక్టర్ అనుదీప్, అధికారులు

**నేలకొండపల్లి:** ఖమ్మం జిల్లా రైతులు హుషారుగా ఉన్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి సోమవారం రైతు నేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన వీసీ ద్వారా రైతువేదికల్లో హాజరైన రైతులు, అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. ఈమేరకు నేలకొండపల్లి రైతు వేదికలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, జిల్లా వ్యవసాయ శాఖాధికారితో పాటు చెన్నారం గ్రామానికి చెందిన ఆదర్శ రైతు మంకెన రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. ఇప్పటివరకు రైతు నేస్తం 57 వీసీలకు క్రమం తప్పకుండా హాజరైన రామకృష్ణ తనకు శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు ఉపయోగపడ్డాయని తెలిపారు. దీంతో సీఎం ఆయనను అభినందిస్తూ 'కేబినెట్‌లోని కీలక పదవులన్నీ మీ జిల్లాకే ఉన్నాయి.. మీకేంటి అంతా హుషారుగా ఉన్నారు' అని వ్యాఖ్యానించారు. రైతులు పంటలు మరింత బాగా పండించి ఆదర్శంగా నిలవాలని సూచించారు. అనంతరం కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ ప్రభుత్వ సాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకుంటూ లాభదాయకమైన పంటలు పండించాలని సూచించారు. ఏడీఏ బి.సరిత, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, రైతులు, నాయకులు ఆరెకట్ల గురవయ్య, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, కడియాల నరేష్, కొమ్మినేని విజయ్‌బాబు, సూరేపల్లి రవి, గుండా బ్రహ్మం, చిలకబత్తిని వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# జాడ లేని వరుణుడు



బోనకల్ మండలం ముష్టికుంట్లలో మొలకెత్తని పత్తి చేను

- పొడి దుక్కుల్లో పత్తి విత్తనాలు నాటిన రైతులు
- ఆపై సరైన వర్షాలు లేక మొలకెత్తని వైనం
- మళ్లీ నాటాలంటే భారం తప్పదని ఆవేదన

**మధిర:** ఈ ఏడాది మే నెల రెండో వారం నుంచే అడపాదడపా వర్షాలు కురవడంతో సాగుకు అనుకూలిస్తుందని రైతులు ఆనందపడ్డారు. వాతావరణ శాఖ అధికారులు సైతం ఈ వానాకాలంలో వర్షాలు ముందస్తుగానే వచ్చే అవకాశముందని ప్రకటించారు. దీంతో రైతులు ముందుగానే దుక్కులు దున్ని పంటల సాగుకు సిద్ధమయ్యారు. పలుచోట్ల మే మూడో వారం నుంచే పొడి దుక్కుల్లో పత్తి విత్తనాలు నాటారు. ఒకటి, రెండు మంచి వర్షాలు పడగానే మొలకలు వస్తాయని భావించారు. కానీ ఈనెల రెండు వారాలు దాటినా వర్షం జాడ లేకపోవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఒకటి, రెండు రోజుల్లో వర్షం కురవకపోతే పత్తి విత్తనాలు భూమిలోనే పాడవుతాయని.. మళ్లీ నాటాల్సి వస్తుందన్న ఆలోచన వారి ఆవేదనకు కారణమవుతోంది.

**2.20లక్షల ఎకరాలకు పైగానే..**

జిల్లాలో గత ఏడాది వానాకాలం సీజన్‌లో 2.08 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. అలాగే, మిర్చి కూడా సాగు చేయగా తెగుళ్లతో దిగుబడి రాక, సరైన ధర లభించక ఈసారి రైతులు మిర్చి వైపు పెద్దగా దృష్టి సారించడం లేదు. దీంతో ఈసారి పత్తి సాగు విస్తీర్ణం గతంతో పోలిస్తే మరో 20వేల ఎకరాలు పెరుగుతుందని భావిస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం 16,534 ఎకరాల్లో పత్తి విత్తనాలు నాటినట్లు తెలుస్తోంది. అయితే, వర్షాభావ పరిస్థితులతో ఈ గింజలు మొలకెత్తుతాయా, లేదా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**గతనెల 20నుంచే...**

జిల్లాలోని బోనకల్, రఘునాథపాలెం, మధిర, కొణిజర్ల, తల్లాడ తదితర మండలాల్లో రైతులు పత్తి విత్తనాలు నాటారు. వర్షాలు ముందుగా వస్తాయన్న ఆశతో గత నెల 20వ తేదీ నుంచి విత్తనాలు నాటడం మొలుపెట్టారు. మరికొందరు ఈనెల మొదట్లో నాటారు. ఆతర్వాత వర్షాలు లేకపోగా, నాలుగు రోజుల క్రితం చిరుజల్లులు కురవడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. కానీ మళ్లీ వర్షం జాడ లేకపోవడంతో రైతుల్లో ఆవేదన వ్యక్తమవుతోంది. ఆది, సోమవారాల్లో సాయంత్రం జిల్లాలోని పలుచోట్ల ఆకాశం మేఘావృతమైనా వర్షం మాత్రం కురవలేదు. రానున్న రెండు, మూడు రోజుల్లో మంచి వర్షం పడితేనే పత్తి విత్తనాలు మొలకెత్తే అవకాశముంది. లేకపోతే అవి భూమిలోనే పాడవుతాయని భావిస్తున్నారు. ఈ కారణంగా పలువురు రైతులు ఆశలు వదిలేసుకుని మళ్లీ నాటేందుకు పత్తి విత్తనాలు కొనుగోలు చేయాలంటే ఆర్థిక భారం తప్పదనే భావనకు వచ్చినట్లు తెలుస్తోంది.

**ఎకరాకు రూ.9వేలకు పైగా పెట్టుబడి**

ఎకరం భూమిలో పత్తి సాగుకు ఇప్పటికే రైతులు రూ.9వేలకు పైగా పెట్టుబడి పెట్టారు. ఫ్లవ్ దుక్కికి రూ.2వేలు, గొర్రు తోలకానికి రూ.1,600, రోటోవేటర్‌కు రూ.2వేలు, అచ్చు తోలకానికి రూ.1,500తో పాటు విత్తనాలకు రూ.1,700, కూలీలకు రూ.800 చొప్పున వెచ్చించారు. ఒకవేళరెండు, మూడు రోజుల్లో మంచి వర్షం కురిసి విత్తనాల మొలకెత్తకపోతే మళ్లీ కొనుగోలు, నాటించడం ఆర్థికంగా భారమవుతుందని చెబుతున్నారు.

**విత్తనాలు మొలకెత్తలేదు**



నేను ఎనిమిది ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి గింజలు పెట్టాను. రెండు, మూడు వారాల నుంచి వర్షాలు లేకపోవడంతో పత్తి గింజలు మొలకెత్తలేదు. ఇప్పటికే రూ.లక్ష ఖర్చు పెట్టాను. విత్తనాలు పాడైపోతాయనే ఆందోళనగా ఉంది.

– తిగుళ్ల దేవేంద్రం, వనంవారికృష్ణాపురం

**పెట్టుబడి రెట్టింపు..**




పది ఎకరాల్లో పత్తి విత్తనాలు నాటాం. వర్షాలు సక్రమంగా రాక పూర్తిస్థాయిలో విత్తనాలు మొలకెత్తలేదు. దీంతో ఏం చేయాలో పాలుపోవడం లేదు. గింజలు మొలకెత్తక, రెండోసారి నాటాలంటే ఖర్చు రెట్టింపు అయి భారం పెరుగుతుంది.

– బంధం హుస్సేన్, రైతు, ముష్టికుంట్ల

## అటు మూత.. ఇటు వెతలు



ఖమ్మం శ్రీనగర్ కాలనీ రోడ్డు నంబర్-1లోని రేషన్ షాపు వద్ద క్యూలో పెట్టిన బస్తాలు




రేషన్ షాప్‌ల ద్వారా ఒకేసారి మూడు నెలల బియ్యం ఇచ్చే క్రమాన అవాంతరాలతో జనం ఇక్కట్లు పడాల్సి వస్తోంది. జిల్లా కేంద్రంలోని పలు షాప్‌ల వద్ద బియ్యం స్టాక్ లేవని బోర్డులు కనిపిస్తుండడంతో స్టాక్ ఉన్న షాప్‌ల వద్ద ఉదయం 6గంటల నుంచే బారులు దీరుతున్నారు. అక్కడ నిలుచునే ఓపిక లేక బియ్యం బస్తాలను వరుసలో పెట్టి పక్కన కూర్చుంటున్నారు. ఒక్కొక్కరి నుంచి మూడు సార్లు వేలిముద్ర నమోదు చేయాల్సి ఉండడంతో జాప్యం జరుగుతోందని డీలర్లు చెబుతున్నారు. సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసినందున ఒకసారి వేలిముద్ర వేస్తే చాలని, అన్ని షాప్‌ల్లో స్టాక్ ఉందని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అమలుకాక తిప్పలు తప్పడం లేదు.


– ఖమ్మం అర్బన్

# ఫిర్యాదులు త్వరగా పరిష్కరించండి

- సామాజిక మాధ్యమాల్లోనూ స్వీకరించాలి
- గ్రీవెన్స్ డేలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ అనుదీప్, పక్కన అధికారులు



కలెక్టరేట్ ఆవరణలో వేచిఉన్న జనం

**ఖమ్మం సహకారనగర్:** ప్రజావాణికి అందే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పరిష్కరించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. అంతేకాక ట్విట్టర్ తదితర సామాజిక మాధ్యమాల ద్వారా కూడా ఫిర్యాదులు స్వీకరిస్తూ పరిష్కారంపై దృష్టి సారించాలని తెలిపారు. కలెక్టరేట్‌లో ప్రజావాణి (గ్రీవెన్స్ డే)లో భాగంగా అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డితో కలిసి ఆయన సోమవారం ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమావేశమైన కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ దరఖాస్తును పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని, అది సాధ్యం కాకపోతే కారణాలను దరఖాస్తుదారులకు చెప్పాలని సూచించారు. అలాగే, జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు దరఖాస్తుల పరిష్కారాన్ని ఆన్‌లైన్ ద్వారా పరిశీలిస్తూ మండల అధికారులకు సూచనలు చేయాలని చెప్పారు. డీఆర్వో ఏ.పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, డీఆర్డీఓ సన్యాసయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా, ఇటీవల కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనుదీప్‌ను ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

**ఫిర్యాదుల్లో కొన్ని...**

- వేంసూర్ మండలం బీరపల్లి వాసులు ప్రభుత్వ స్థలంలో అనుమతులు లేకుండా జరుగుతున్న నిర్మాణాన్ని నిలిపివేయించాలని కోరారు.
- ఖమ్మం శ్రీరామ్ హిల్స్‌కు చెందిన వనమా ఉషారాణి ధంసలాపురం సర్వే నంబర్ 194లో రెండెకరాల వ్యవసాయ భూమి ఆక్రమణపై ఫిర్యాదు చేశారు. తన భూమిపై ఇతరులకు జారీ చేసి పట్టా పాస్ పుస్తకాన్ని రద్దు చేయాలని కోరారు.
- ఖమ్మం బొక్కలగడ్డకు చెందిన సునీత డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇప్పించాలని విన్నవించారు.
- తెలంగాణ ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డాక్టర్ కే.వీ.కృష్ణారావు కోరారు. తొలి, మలి దశ ఉద్యమకారులతో కలిసి కలెక్టర్ వినతిపత్రం అందించారు.

**వారంలోగా ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక**

**ఖమ్మంగాంధీచౌక్:** పేదల సొంతింటి ఆకాంక్ష నెరవేర్చేలా ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లపై ప్రత్యేక అధికారులతో సమీక్షించారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 3,500 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఇళ్ల సంఖ్యకు అనుగుణంగా ఇందిరమ్మ కమిటీల నుంచి జాబితాలు తీసుకున్నాక మరోమారు పరిశీలించి పారదర్శకంగా వారంలోగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని తెలిపారు. అలాగే, పంపిణీ చేయకుండా మిగిలిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించి అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేయడంతో పాటు మిగిలిపోయిన నిర్మాణాలపై ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. జెడ్పీ సీఈఓ దీక్షారైనా, హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారిణి ఆశాలత, డీఎల్‌పీఓ రాంబాబు, ఆర్డీఓలు జి.నరసింహారావు, ఎల్.రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

**సారొస్తేనే ఇస్తాం..**

ఇటీవలే కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనుదీప్ తొలిసారి సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణికి హాజరయ్యారు. అయితే, కలెక్టర్ ఉదయమే మంత్రి పొంగులేటి పర్యటనకు వెళ్లగా, అప్పటికే అదనపు కలెక్టర్లు గ్రీవెన్స్ డేలో ఫిర్యాదుల స్వీకరణ ప్రారంభించారు. కానీ చాలా మంది కలెక్టరేట్ ఆవరణలోనే వేచి ఉండి, కలెక్టర్ అనుదీప్ వచ్చాకే దరఖాస్తులు ఇవ్వడం కనిపించింది.

## క్లుప్తంగా

### దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు



ఎస్‌ఐ రామారావుతో దివ్యాంగులు

వైరా: వివిధ కారణాలతో దివ్యాంగులుగా మారిన ఉమ్మడి జిల్లాలోని ఆరుగురికి వైరా ఎస్‌ఐ పుష్పాల రామారావు చొరవతో కృత్రిమ కాళ్లు సమకూరాయి. ఏపీలోని మంగళగిరి, హైదరాబాద్ జూబ్లీహిల్స్ రోటరీ క్లబ్ ఆధ్వర్యాన ఆరుగురికి మంగళగిరిలోని రోటరీక్లబ్ కార్యాలయంలో కృతిమ కాళ్లు అమర్చారు. తక్కువ బరువు కలిగిన వీటితో దివ్యాంగులకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా దివ్యాంగులు సోమవారం వైరా ఎస్‌ఐ రామారావు, రోటరీ క్లబ్ బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

### జనరల్ ఆస్పత్రి కిటకిట



ఓపీ కౌంటర్ల వద్ద బారులు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సోమవారం కిటకిటలాడింది. ఉదయం 8గంటల నుంచే పరీక్షలు, చికిత్స కోసం వచ్చిన పలువురు ఓపీ చీటీల కోసం బారులు దీరారు. మారిన వాతావరణ పరిస్థితుల్లో జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడుతున్న వారు ఆస్పత్రికి వచ్చారు. అయితే, ఓపీ చీటీల కోసం గంటల తరబడి వేచి ఉండడం, ఆపై వైద్యుల వద్ద పరీక్ష చేయించుకోవడానికి సమయం పట్టడంతో వృద్ధులు ఇబ్బంది పడ్డారు. ఇక నిర్దేశిత పరీక్షలు చేయించుకుని నివేదికలతో వచ్చే సరికి ఓపీలో వైద్యులు ఉండకపోవడంతో సమస్యలు ఎదురయ్యాయి. దీంతో మరో వైద్యుడి వద్దకు వెళ్లి మందులు రాయించుకోవాల్సి వచ్చిందని వాపోయారు.

### రైతుల ప్రయోజనాల కోసం చట్టం ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన విత్తన చట్టం అన్నదాతల ప్రయోజనాలను కాపాడేలా ఉండాలని ఏఐయూకేఎస్(అఖిల భారత ఐక్య రైతు సంఘం) రాష్ట్ర కోశాధికారి ఆవుల వెంకటేశ్వర్లు, నాయకుడు గుర్రం అచ్చయ్య అన్నారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మలీదు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించకుండా ప్రైవేట్ విత్తన కంపెనీలు, డీలర్లతో సమావేశమై చట్టాన్ని తీసుకొస్తే రైతులకు ప్రయోజనం ఉండదన్నారరు. ఈమేరకు రైతు సంఘాలు, శాస్త్రవేత్తలు, రైతుల నుంచి సూచనలు స్వీకరించాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు కోలేటి నాగేశ్వరరావు, కమ్మకోమటి నాగేశ్వరరావు, బీరెల్లి లాజర్, గుగులోతు తేజ, పాశం అప్పారావు, ఒగ్గు నాగిరెడ్డి, కుర్ర వెంకన్న, కేలోతు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

### పామాయిల్ గెలలు



| టన్ను ధర | రూ.18,748 |
|---|---|

# అర్చక, ఉద్యోగులకు ‘సంక్షేమ నిధి’

- కేటగిరీల వారీగా ఆర్థిక ప్రయోజనాలు
- సేవల ఆధారంగా లబ్ధి చేకూర్చేలా నిర్ణయం
- జాబితాలో ధూప, దీప పథకం అర్చకులు కూడా..



ఖమ్మంలోని భ్రమరాంబ సమేత గుంటు మల్లేశ్వరస్వామి దేవాలయం

ఖమ్మంగాంధీచౌక్: ఆలయాల్లో పనిచేసే అర్చక, ఉద్యోగుల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించింది. శాశ్వత అర్చక, ఉద్యోగులతో పాటు ధూప దీప నివేదన(డీడీఎన్) పథకం అమలవుతున్న ఆలయాల అర్చకులకు ప్రయోజనం కలిగేలా చర్యలు చేపట్టింది. ఈమేరకు సంక్షేమ నిధి ద్వారా అర్చక, ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలు, సామాజిక భద్రత కల్పించే లక్ష్యంగా విధివిధానాలను ప్రకటించింది. అంతేకాక పదవీ విరమణ పొందిన తర్వాత అందే ప్రయోజనాలను సైతం పెంచడం విశేషం. అయితే, ఈ ప్రయోజనాలు అర్చక, ఉద్యోగుల సేవా కాలం ఆధారంగా అందుతాయి. ప్రభుత్వ నిర్ణయంతో మెడికల్ రీయింబర్స్‌మెంట్, వివాహపథకం, ఉపనయనం, ఇంటి నిర్మాణం, మరమ్మతులు, విద్య తదితర అంశాల్లో లబ్ధి జరగనుంది.

**సంక్షేమ ట్రస్టు ద్వారా ప్రయోజనాలు**

రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆలయ అర్చక, ఉద్యోగుల ప్రయోజనాల కోసం సంక్షేమ నిధిని ఏర్పాటు చేసింది. ఈ ట్రస్టు ద్వారా పది రకాల పథకాలు అమలుకానున్నాయి.

- అర్చక, ఉద్యోగులకు రిటైర్‌మెంట్ గ్రాట్యూటీ (మరణానంతరం) 20ఏళ్లకు పైగా సేవలందించి వారైతే రూ.8 లక్షలు, 15–20 ఏళ్ల సర్వీస్ కలిగిన వారికి రూ.6 లక్షలు, 10–15 ఏళ్ల సర్వీస్ ఉంటే రూ.4 లక్షలు, పదేళ్ల కనీస సర్వీస్ పూర్తికాక ముందే మృతి చెందితే రూ.2 లక్షలు చెల్లిస్తారు. అలాగే, ధూప, దీప నివేదన పథకం అర్చకులకు మరణానంతరం గ్రాట్యూటీ రూపంలో సర్వీస్ ఆధారంగా రూ.4లక్షలు, రూ.3లక్షలు, రూ.2లక్షలు, రూ.లక్ష అందుతాయి.
- మెడికల్ రీయింబర్స్‌మెంటు గ్రాంట్ కింద మెడికల్ బోర్డు సిఫారసుతో గరిష్ఠంగా రూ.2 లక్షలు అందించనున్నారు.
- వివాహ పథకం కింద రెగ్యులర్ ఉద్యోగులు, కన్సాలిడేటెడ్, ధూప, దీప నివేదన అర్చకులకు రూ.1,01,116 అందిస్తారు. రెగ్యులర్ ఉద్యోగులకైతే రుణంగా రూ. 2 లక్షలు, మహిళా ఉద్యోగితో పాటు ఆమె కుమార్తె, సోదరి వివాహానికి రూ. 1,25,000 అందిస్తారు.
- ఉపనయనం గ్రాంట్ కింద రూ. 50 వేలు అందించనున్నారు.
- మరణానంతరం ఎక్స్‌గ్రేషియాగా రూ.50 వేలు, అంతిమ సంస్కారాల ఖర్చులకు రూ.30 వేలు అందిస్తారు.
- ఇంటి నిర్మాణానికి రూ.50 వేలు, రెగ్యులర్ ఉద్యోగులకైతే రూ.4 లక్షల మేర బ్యాంకు రుణంపై వడ్డీ మొత్తం ఐదేళ్ల వరకు చెల్లిస్తారు.
- విద్య పథకం ద్వారా గ్రాడ్యుయేషన్, పీజీ, పీహెచ్‌డీ కోర్సులకు ఏటా రూ.35 వేలు రీయింబర్స్‌మెంట్ చేస్తారు.
- విధులు నిర్వర్తించలేదని దివ్యాంగులైన ఉద్యోగులకు ఆర్థిక సాయంగా కనీసం 5 – 10 ఏళ్ల సర్వీస్ పూర్తయితే రూ.లక్ష, పదేళ్లకు పైగాసర్వీస్ ఉంటే రూ. 2లక్షలు అందిస్తారు.

**ఉమ్మడి జిల్లాలో 702 మంది**

రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన సంక్షేమ ట్రస్టు ద్వారా ఉమ్మడి జిల్లాలోని ఆలయాల అర్చక, ఉద్యోగులు, ధూప, దీప నివేదన అర్చకులు కలిపి 702 మందికి ప్రయోజనం కలగనుంది. రెండు జిల్లాల్లోని 93 ఆలయాల్లో 100 అర్చకులు, పాచికలు, సహాయ అర్చకులు, పరిచారకులు పనిచేస్తుండగా, జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లు, ఇతర ఉద్యోగులు కలిపి 140 మంది ఉన్నారు. అలాగే, ధూప, దీప నివేదన పథకం ఆలయాల్లో 462 మంది అర్చకులు పనిచేస్తున్నారు.

**ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం**



ప్రభుత్వం అర్చకులు, ఉద్యోగుల ప్రయోజనాలకు సంక్షేమ నిధిలో ప్రాధాన్యత ఇచ్చింది. డీడీఎన్ అర్చకులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ప్రకటించడం సంతోషంగా ఉంది. అయితే, ఈ అర్చకులకు నెలనెలా వేతనాలు అందేలా చూడాలి. అంతేకాక మరిన్ని ఆలయాలకు పథకం అమలుచేస్తే అభివృద్ధితో పాటు మరికొందరు అర్చకులకు ఉపాధి లభిస్తుంది.

– మునగలేటి రమేష్‌శర్మ, జిల్లా అధ్యక్షుడు, డీడీఎన్ అర్చకుల సంఘం

# స్త్రీనిధి లక్ష్యం.. రూ.82.99 కోట్లు

- 2025–26 ఏడాదికి రుణ ప్రణాళిక ఖరారు
- కొన్ని ప్రాంతాల సభ్యుల్లో తగ్గుతున్న ఆసక్తి
- చెల్లింపు సమయాన అవకతవకలపై ఆందోళన

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్థిక స్వావలంబన సాధించాలన్న ఆలోచనతో ప్రైవేట్ వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి అప్పులు చేస్తున్న కొందరు మహిళలు నష్టపోతున్నారు. ఇంకొందరు అప్పులు ఎందుకుని తమ ఆశలను చిదిమేసుకుంటున్నారు. ఈనేపథ్యాన ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యులకు స్త్రీనిధి ద్వారా రుణాలు మంజూరు చేస్తోంది. స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులు ఆర్థికంగా ఎదిగేలా ఏటా కొందరికి వ్యక్తిగతంగా రుణాలు ఇస్తుండగా మహిళలు కుటుంబ అవసరాలను తీర్చుకోవడంతో పాటు ఆర్థిక పురోగతి పొందేలా చిరు వ్యాపారాలు మొదలుపెడుతున్నారు. ఈ మేరకు 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లాలో మహిళ సభ్యులకు రూ.82.99 కోట్లు స్త్రీనిధి ద్వారా రుణం మంజూరు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది.

**అర్హులను గుర్తించి..**

వీఓల్లో నమోదైన సంఘాలను గుర్తించి అందులో క్రమం తప్పకుండా పొదుపు చేస్తున్న సభ్యులను అర్హులుగా నిర్ధారిస్తారు. ఆపై వారు చేసిన పొదుపు ఆధారంగా అవసరమైన రుణ మొత్తాన్ని బ్యాంకుల ద్వారా అందించేలా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మెప్మా అధికారులు, స్త్రీనిధి సిబ్బంది దృష్టి సారించారు. గత ఆర్థిక సంవత్సరంలో అమలైన ప్రణాళిక ఆధారంగా ఈసారి ప్రభుత్వం సూచనలతో మరింత మందికి రుణాలను అందించాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని మండలాల వారీగా విభజించారు.

**ఆర్థికంగా అభివృద్ధి**

మహిళా సంఘాల్లో సభ్యులుగా చేరిన వారు క్రమం తప్పకుండా పొదుపు చేస్తూనే ప్రభుత్వం బ్యాంకుల ద్వారా అందించే రుణాలే కాక స్త్రీనిధి రుణాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుంటున్నారు. ఈమేరకు వివిధ వ్యాపారాలు స్థాపించి ఆర్థికాభివృద్ధి సాధించడమే కాక రుణాన్ని తిరిగి చెల్లిస్తుండడంతో బ్యాంకులు ఏటా రుణపరిమితి పెంచుతున్నారు. పలువురు టైలరింగ్, డెయిరీఫామ్, కిరాణం, చిరు వ్యాపారాలు నిర్వహిస్తున్నారు.

**తగ్గుతున్న ఆసక్తి..**

కొన్నేళ్లుగా స్త్రీనిధి రుణాలు తీసుకోవడంపై సభ్యుల్లో ఆసక్తి తగ్గుతున్నట్లు తెలుస్తోంది. బ్యాంక్ లింకేజీ రుణాలైతే సభ్యులు నేరుగా బ్యాంక్ ఖాతాలో జమ చేయాలి. అదే స్త్రీ నిధి రుణాలైతే సమాఖ్య అధ్యక్షురాలికి చెల్లించాల్సి ఉంది. ఇటీవల పలువురు అధ్యక్షులు, సిబ్బంది సభ్యులు చెల్లించే రుణాలను బ్యాంకుల్లో జమ చేయకుండా సొంతానికి వాడుకున్నట్లు తేలింది. దీంతో మహిళలు కిస్తీలు చెల్లించినా బకాయిదారులుగా మిగులుతుండడంతో సభ్యులు వెనుకంజ వేస్తున్నట్లు సమాచారం. దీంతోనే గతేడాది 75 శాతం మేర లక్ష్యాలు కూడా చేరకపోగా, ఈసారి లక్ష్యం చేరేలా డీఆర్‌డీఏ, మెప్మా అధికారులు దృష్టి సారించారు.

మండలాల వారీగా సభ్యులకు ఇచ్చే రుణాలు (రూ.కోట్లల్లో)

| మండలం | లక్ష్యం | మండలం | లక్ష్యం |
|---|---|---|---|
| ఖమ్మం రూరల్ | 4.92 | చింతకాని | 3.00 |
| ఎర్రుపాలెం | 4.40 | తల్లాడ | 2.82 |
| నేలకొండపల్లి | 4.55 | తిరుమలాయపాలెం | 2.77 |
| ముదిగొండ | 4.20 | వైరా | 2.60 |
| కల్లూరు | 3.77 | సత్తుపల్లి | 2.45 |
| మధిర | 3.76 | వేంసూరు | 2.36 |
| కొణిజర్ల | 3.43 | కామేపల్లి | 2.06 |
| రఘునాథపాలెం | 3.38 | సింగరేణి | 1.73 |
| కూసుమంచి | 3.37 | పెనుబల్లి | 1.51 |
| బోనకల్ | 3.18 | ఏన్కూరు | 1.50 |

| మెప్మా పరిధిలో.. | |
|---|---|
| కస్తూరి | 7.30 |
| మహాత్మాగాంధీ | 5.79 |
| ప్రియదర్శిని | 1.68 |
| సరస్వతి | 2.71 |
| ఖమ్మం అర్బన్ | 1.17 |

## బెటర్‌మెంట్ ఫలితాల్లో ‘న్యూవిజన్’ ప్రభంజనం



విద్యార్థులతో చైర్మన్ సీహెచ్‌జీకే.ప్రసాద్, డైరెక్టర్లు

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ బెటర్‌మెంట్ పరీక్ష(అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ) ఫలితాల్లో తమ విద్యార్థులు రాష్ట్రంలోనే అత్యుత్తమ మార్కులు సాధించారని న్యూవిజన్ విద్యాసంస్థల చైర్మన్ సీహెచ్‌జీకే.ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను సోమవారం అభినందించాక ఆయన మాట్లాడారు. జూనియర్ ఎంపీసీలో 470 మార్కులకు యు.శృతి, ఎస్.గ్రీష్మిత, వి.లక్ష్మీ స్నేహిత, పి.అవినాష్, కె.నేహశ్రీ 468 మార్కులు సాధించారని తెలిపారు. అలాగే, కె.సాయిసాత్విక్, ఎం.శ్రీరోషిణి, కె.శేషుకుమార్, ఎం.ప్రహర్షిణి, ఎం.కిద్విత, పి.సాత్విక, ఎం.నాగవెంకటసాయి చరణ్, కె.రోహిత, డి.తన్వి, ఎస్.గౌరినందరెడ్డి, ఎస్.సిరిసంజన, డి.శ్రీజయదీప్ కుమార్, సీ.హెచ్.ఆదిత్య శ్రీవాత్సవ, కె.రూపిక, జి.రిషిక్ తేజ, బి.శ్రీకరణ్, ఎం.డీ.అస్లాంహంజా, టి.మన్వితతేజు, ఆర్.సిరిచందన, ఎం.గీతిక శ్రీ 467మార్కులు సాధించారన్నారు. బైపీసీలో 440 మార్కులకు ఏ.విద్యాశ్రీ, కె.ఆరోన్ నిహార్రాయ్, జి.స్పందన, అమతున్నూర్నధియా, బి.అర్షిత, బి.నాగలోకేష్, ఎం.డీ.ఇనాన్ 436మార్కులు, ఎం.రోషిణి, టి.గోమతి 435, కె.గుణశేషు, బి.శశాంక్ 434, కె.యశస్విని, మాహీరమెహ్రోజ్ 433, బి.శరణ్య, కె.హాసిని, టి.సాత్విక 432, ఎం.లక్ష్మీహర్షిత, బి.హిమ, ఏ.సాత్విక, జి.ప్రణీత్, జి.శ్రీవెంకటనాగకోమలి, పి.నిఖిత 431 సాధించారని మార్కులు సాధించారని తెలిపారు. ఈకార్యక్రమంలో డైరెక్టర్లు సీ.హెచ్.గోపీచంద్, సీ.హెచ్.కార్తీక్, ప్రిన్సిపాళ్లు బ్రహ్మచారి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ‘శ్రీ చైతన్య’ సత్తా



విద్యార్థులతో చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, తదితరులు

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం బెటర్‌మెంట్ పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారని శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అభినందించాక ఆయన మాట్లాడుతూ ఎంపీసీలో 13మంది 470కి 468 మార్కులు, బైపీసీలో 440కి 439 మార్కులు సాధించారన్నారు. ఎంపీసీలో బి.జీవన, ఏ.భవిత, పి.నందిని, వై.భరత్ తేజ, డి.యశ్వంత్, బి.ధరణి, కె.జ్యోతి, ఎం.నాగహాసిని, పి.మోక్షిత, ఎస్.నాగజ్యోతి, జి.భావన, బి.వర్షిత, జీర మేహక్ 468, బైపీసీలో కె.గాయత్రి 439, బి.అప్రూవ, జి.జోహాన్ విశిష్ఠ, కె.జ్యోత్స్న 438మార్కులు సాధించారని తెలిపారు. విద్యార్థులను చైర్మన్, డైరెక్టర్‌తో పాటు అకడమిక్ డైరెక్టర్ బి.సాయిగీతిక, డీజీఎం సీహెచ్.చేతన్ మాథూర్, ఎగ్జిక్యూటివ్ డీన్ ఎస్ఆర్ఎస్‌డీ.వర్మ, డీన్ కృష్ణ, ఏజీఎంలు సీహెచ్.బ్రహ్మం, జి.ప్రకాష్, గోపాలకృష్ణ అభినందించారు.

## ప్రైవేట్ విద్యాసంస్థల గోదాం సీజ్



పాఠశాల వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఫీజులు, పుస్తకాల పేరిట ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో తల్లిదండ్రుల నుంచి విచ్చవిడిగా వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఏఐఎస్ఎఫ్ నాయకుడు ఇటికాల రామకృష్ణ విమర్శించారు. ఈమేరకు నాయకులు సోమవారం ఖమ్మంలోని నారాయణ విద్యాసంస్థల కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. దీంతో అర్బన్ ఎంఈఓ శైలజ తనిఖీలు చేపట్టి పాఠశాల గోదాంను సీజ్ చేశారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ వివిధ పేర్లతో ఎక్కువ ఫీజులు వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇకనైనా అన్ని పాఠశాలల్లో తనిఖీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్, నాయకులు షేక్ నాగుల్‌మీరా, మధు, మనోజ్, గోపి, పవన్, వినయ్, లక్ష్మణ్, గౌతమ్, సురేష్, నాగరాజు, ఉమ, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

ముదిగొండ: ముదిగొండ మండలం వనంవారికిష్టాపురం సమీపాన సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం బూదవాడకు చెందిన పి.పున్నయ్య(70) ఆటోలో ఖమ్మం నుంచి జగ్గయ్యపేట వెళ్తున్నాడు. మార్గమధ్యలో వనంవారి కిష్టాపురం సమీపాన ఆటోను బైక్ ఢీకొనగా పున్నయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో 108వాహనంలో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

# మోదీ పాలనలోనే దేశాభివృద్ధి



పార్టీలో చేరిన వారితో నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రధాని నరేంద్రమోదీ హయాంలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు తెలిపారు. ఖమ్మం శ్రీనివాస్ నగర్‌లో సోమవారం నిర్వహించిన వికసిత్ భారత్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలు పేదలందరికీ అందుతుండగా, దేశం అభివృద్ధి సాధిస్తోందని తెలిపారు. అలాగే, పాకిస్తాన్‌పై దాడి ద్వారా దేశ సైన్యం ఘనతను ప్రపంచానికి చాటారని చెప్పారు. అనంతరం వివిధ పార్టీల నుంచి బీజేపీలో చేరిన వారికి ఆయన బీజేపీ కండువాలు కప్పి ఆహ్వానించారు. నాయకులు గుత్త వెంకటేశ్వర్లు, పిట్టల వెంకట నరసయ్య, రుద్ర ప్రదీప్, కొణతం లక్ష్మీనారాయణ, నల్లగట్టు ప్రవీణ్, పమ్మి అనిత, ఈదుల భద్రం, నెల్లూరు బెనర్జీ, రేఖా సత్యనారాయణ యాదవ్, వీరవెల్లి రాజేష్, రాఘవగౌడ్, గోనెల శివ, మణి, రజినీరెడ్డి, శంకర్‌గౌడ్, డోన్వాన్ దాసు పాల్గొన్నారు.

# హృద్రోగంతో పోరాడుతున్నా... ఆదుకోండి

ఓ పేద వృద్ధుడి అభ్యర్థన



వెంకటగోపీ కిషన్‌రావు

ఖమ్మంమయూరిసెంటర్: పూట గడవడమే కష్టంగా ఉన్న ఓ నిరుపేదను గుండె జబ్బు మరింత బాధిస్తోంది. కనీసం చికిత్స చేయించుకునే పరిస్థితి లేకపోవడంతో దాతల చేయూత కోసం అర్థిస్తున్నాడు. ఖమ్మంకు చెందిన వివెంకటగోపీ కిషన్‌రావుకు 65ఏళ్లు. రోజు కూలీగా జీవిస్తుండగా, ఆయన భార్య టైలరింగ్ చేస్తుంది. కొంతకాలంగా హృద్రోగంతో బాధపడుతున్న కిషన్‌రావు ఇప్పుడు పనులకు వెళ్లలేని పరిస్థితి ఎదురైంది. తెలిసిన వారి సాయంతో ఆస్పత్రికి వెళ్తే స్టంట్లు వేయాలని తెలిపారు. ఇందుకోసం తగిన స్థోమత లేకపోవడంతో ఆయన కుటుంబం తీవ్ర మనో వేదనకు గురవుతోంది. ఈమేరక దాతలు 63040 09513 నంబర్‌కు సాయం పంపించి ఆదుకోవాలని కిషన్‌రావు కోరుతున్నాడు.

## పని ఆగదు.. రోడ్డు పాడు కాదు



ఖమ్మం పదో డివిజన్‌లో అండర్ డ్రెయినేజీ నిర్మిస్తుండగా బైపాస్‌లోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద పనులు చేపట్టాల్సి ఉంది. అయితే, పైప్‌లైన్ వేయడానికి రోడ్డు తవ్వాల్సి రావడంతో ట్రాఫిక్ సమస్య ఎదురవుతుందని గుర్తించారు. అంతేకాక రోడ్డు కూడా పాడయ్యే అవకాశముండడంతో నిర్మాణ సంస్థ ప్రతినిధులు ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా రోడ్డు అడుగున తవ్వకం చేపట్టి 16 పైపులు అమర్చే పనులు చేపట్టారు. ఆ తర్వాత సాగర్ కాల్వ అడుగు భాగాన సైతం ఇదే తరహాలో పైప్‌లైన్ వేయనున్నట్లు బాధ్యులు తెలిపారు.

– ఖమ్మం అర్బన్

# ఆదర్శం.. ఈ ఉపాధ్యాయులు

ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్పించిన పలువురు



కల్లూరురూరల్: మోక్షిత్‌కు అడ్మిషన్ ఇస్తున్న ఉపాధ్యాయుడు



సత్తుపల్లి టౌన్ : కుమారుడిని హైస్కూల్‌లో చేర్పిస్తున్న అరుణకుమారి

సత్తుపల్లిటౌన్/కల్లూరురూరల్/వేంసూరు: ప్రభుత్వ ఉపాధ్యాయులు వారి పిల్లల్ని ప్రైవేట్ పాఠశాలల్లో చదివిస్తూ ఇతరుల పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించాలని ప్రచారం చేస్తున్నారనే విమర్శలు తరచుగా వస్తుంటాయి. ఈనేపథ్యాన కొందరు ఉపాధ్యాయులు మాత్రం తమ పిల్లలను సైతం ప్రభుత్వ బడుల్లో చేర్పించి ఆదర్శంగా నిలిచారు. సత్తుపల్లి ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు మారుతి అరుణకుమారి – జిట్టయ్య దంపతులు తమ పిల్లలను పాతసెంటర్ హైస్కూల్‌లో చేర్పించారు. వీరి పెద్దకుమారుడు ఇదే పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతుండగా, ఇప్పుడు చిన్నకొడుకు యువరామ్ తేజను ఆరో తరగతిలో చేర్పించారు. అలాగే, ఎన్టీఆర్‌నగర్ పాఠశాల ఉపాధ్యాయుడు కంభంపాటి వెంకటేష్ తన కుమారుడు విహాన్‌ను మూడో తరగతిలో చేర్పించారు. ఇక కల్లూరు మండలం పాత ఎర్రబోయినపల్లికి చెందిన మునగ దివ్య అన్నపురెడ్డిపల్లిలోని రాజాపురం ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తోంది. ఆమె భర్త బుద్ధారపు నాగేశ్వరరావు బ్యాంకు ఉద్యోగి కాగా వారి కుమారుడు మోక్షిత్‌ను పాత ఎర్రబోయినపల్లిలో అమ్మమ్మ, తాతయ్య వద్ద ఉంచి అదే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో సోమవారం చేర్పించారు. మోక్షిత్‌కు హెచ్‌ఎం వేదగిరి అశోక్ రెండో తరగతిలో ప్రవేశం కల్పించారు. అలాగే, వేంసూరు ప్రగతినగర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లెల్లి నాగ శ్రీనివాసరావు కుమారుడు హేమ శ్రీకార్ ప్రైవేట్ పాఠశాలలో తొమ్మిదో చదువుతుండగా సోమవారం వేంసూరు జెడ్పీహెచ్ఎస్‌లో చేర్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ సీహెచ్.వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం బీ.కే.నరసింహారావు తదితరులు అభినందించారు.



వేంసూరు : హేమ శ్రీకార్‌ను పాఠశాలలో చేర్పిస్తున్న శ్రీనివాసరావు

## డ్రైవర్‌గా తీసుకెళ్తే కారుతో పరార్

నేలకొండపల్లి: ఓ వృద్ధ దంపతులు ఆస్పత్రికి వెళ్లేందుకు తమ కారు డ్రైవర్‌గా తీసుకెళ్లిన వ్యక్తి వారిని వదిలేసి కారుతో పరారైన ఘటన ఇది. మండల కేంద్రానికి చెందిన గోళ్ల కృష్ణమూర్తి–రాజమ్మ దంపతులు శనివారం సూర్యాపేటజిల్లా కోదాడలోని ఆస్పత్రికి వెళ్లేందుకు తమ కారు డ్రైవర్‌గా రావాలని స్థానికుడైన గోపిని సంప్రదించారు. దీంతో వారిని తీసుకెళ్లిన ఆయన ఆస్పత్రిలో పరీక్ష చేయించుకుని వచ్చేసరికి కానరాలేదు. ఫోన్ చేసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో కోదాడ నుంచి ఆటోలో ఇంటికి వచ్చిన వారు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## మహిళ మృతిపై కేసు నమోదు

వైరారూరల్: మండలంలోని గొల్లపూడి–పాలడుగు మధ్య ఆదివారం జరిగిన ఘటనలో ఓ మహిళ మృతి చెందగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.రామారావు తెలిపారు. బోనకల్ మండలం కలకోటకు చెందిన కోపెల సురేష్ – మరియమ్మ (40) దంపతులు కొణిజర్ల మండలం కొండవనమాల వెళ్లి తిరిగి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. అయితే, గొల్లపూడి–పాలడుగు మధ్య బైక్‌పై వెనుకాల కూర్చున్న మరియమ్మ కింద పడడంతో తలకు బలమైన గాయమై మృతి చెందింది. కాగా, మృతురాలికి ఆమె భర్తతో జరుగుతున్న గొడవలతో ఆయనే కిందకు నెట్టేసి ఉంటాడన్న అనుమానంతో మరియమ్మ తండ్రి బాబు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.